క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రఘునాథాచారి

సంతకవిటి: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ ఎస్. రఘునాథాచారి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యాలయానికి వచ్చే ప్రజలు చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయవద్దు

రాజాం: మురుగుకాలువల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, గ్లాసులు వంటి వస్తువులు వేయవద్దని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ పట్టణవాసులు, వ్యాపారులకు సూచించారు. పట్టణంలోని శ్రీనివాసా థియేటర్ రోడ్డు, కొండకవీధి, మాధవబజార్, తదితర ప్రాంతాల్లో మురుగుకాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలువల్లో వ్యర్థాలు వేయడం వల్ల రోడ్ల మీదకు మురుగు నీరు చేరుతోందని చెప్పారు. ఈ విషయంలో ప్రజలు సహకరించాలని కోరారు.

ఆధార్ అప్‌డేషన్ వేగవంతం



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ రఘునాథాచారి

సంతకవిటి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల వద్ద ఆధార్‌కార్డుల అప్‌డేషన్ వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధార్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పంచాయతీల వారీగా డిజిటల్ సేవలపై ఆరా తీశారు.

సేవలకు సత్కారం



కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లను సత్కరిస్తున్న ఈఓ, తదితరులు

రాజాం సిటీ: మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్‌లను పోలిపల్లి పైడితల్లి ఆలయ ఆవరణలో ఈఓ బీవీ మాధవరావు శుక్రవారం సత్కరించారు. ఇటీవల నిర్వహించిన జాతరలో వారు అందించిన సేవలకు గాను ఈ సత్కార కార్యక్రమం నిర్వహించినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు సలాది తులసీదాస్, గంది గోపి, వెంపల లక్ష్మణరావు, ఆలయ అర్చకులు వేమకోటి సూర్యనారాయణశర్మ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చేయూత

రాజాం సిటీ: మహిళల ఆర్థిక బలోపేతానికి సెంటాన్స్ స్త్రీశక్తి కేంద్రం చేయూత అందిస్తుందని కేంద్రం డైరెక్టర్ సిస్టర్ హిల్డా అన్నారు. శుక్రవారం స్థానిక సెంటాన్స్ స్త్రీశక్తి సెంటర్‌లో టైలర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూచ, కుటుంబ బాధ్యత తీసుకున్న ప్రతి మహిళ ఆర్థిక శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఘనంగా సింహాద్రి అప్పన్న సంబరాలు ప్రారంభం

బాడంగి: మండల కేంద్రంలోని దేవరాపల్లి వారి ఇంటి వద్ద సింహాద్రి అప్పన్న సంబరాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సింహాద్రి అప్పన్నకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు.

పాడిపశువుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట

రామభద్రపురం: పాడిపశువుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్థానిక పశువైద్యాధికారిణి హిరణ్య అన్నారు. శుక్రవారం స్థానిక పశువైద్యశాలలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ వేసవిలో పాడి పశువులకు జడుపులు వచ్చే ప్రమాదం ఉన్నందున 13,900 గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు సిద్ధం చేశామని తెలిపారు. ప్రతీ పాడిరైతు తప్పనిసరిగా పశువులకు ఈ టీకాలు వేయించాలన్నారు. ఇప్పటికే 10 వేల మేకలు, గొర్రెలకు పారుదు వ్యాధి నివారణ టీకాలు వేశామని, మిగతా వాటికి కూడా టీకాలు వేస్తున్నామన్నారు. వేసవి నేపథ్యంలో పశువుల ఆరోగ్యంపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

సచివాలయం తనిఖీ

వంగర: మండలంలోని తలగాం గ్రామ సచివాలయాన్ని ఈఓపీఆర్‌డీ లోపింటి త్రినాథులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యపరంగా ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

రాజాం సిటీ: ఉత్తరాంధ్ర అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక అరుణోదయ ఇనిస్టిట్యూట్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టభద్రులంతా వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి ఉత్తరాంధ్ర అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు. ఎంతో మంది వస్తారు హామీలు ఇస్తారు గాని... ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. వెనుకబాటు తనానికి గురైన ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విశాఖపట్నాన్ని పరిపాలనా రాజధానిగా ప్రకటించారని గుర్తుచేశారు. పట్టభద్రులంతా ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, నాయకులు పొట్నూరు లక్ష్మణరావు, టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం

వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా పార్టీ నేతలు పలువురు శుక్రవారం విస్తృత ప్రచారం చేపట్టారు. పట్టభద్రులైన వారి ఇంటింటికీ వెళ్లి, మొదటి ప్రాధాన్యత ఓటు సుధాకర్‌కు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మరికొంతమంది వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి, కరపత్రాలు పంపిణీ చేస్తూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తున్నారు. ఆయన గెలుపు ద్వారా విశాఖ రాజధాని కావాలన్న ఉత్తరాంధ్రుల బలమైన ఆకాంక్షను వినిపించాలని పిలుపునిస్తున్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో పట్టభద్రులంతా పాల్గొని, ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

–సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి



వంగర: సుధాకర్‌ను గెలిపించాలంటూ ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, కరణం సుదర్శనరావు



మెంటాడ: ఇంటింటికీ వెళ్లి సీతంరాజుకు ఓటు వేయాలని కోరుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రామభద్రపురం: సుధాకర్‌ను గెలిపించాలని కోరుతున్న ఎంపీపీ లక్ష్మణరావు



రేగిడి: ఖండ్యాంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ దార అప్పలనరసమ్మ, తదితరులు



బొబ్బిలి రూరల్: అలజంగి గ్రామంలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ శాంతికుమారి



తెర్లాంలో సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేయాలని కోరుతున్న పార్టీ మండల అధ్యక్షుడు బాబ్జీరావు

1410 మంది ఓటర్లు

రేగిడి: మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో 1410 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని తహసీల్దార్ టి. కల్యాణ చక్రవర్తి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఉంగరాడమెట్ట వద్ద ఉన్న గురుకుల పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికలకు సంబంధించి గ్రాడ్యుయేట్ ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేస్తున్నామన్నారు.

భూముల రీసర్వేతో రైతులకు ప్రయోజనం



సరసనాపల్లిలో గ్రామసభ నిర్వహిస్తున్న తహసీల్దార్ కల్యాణచక్రవర్తి

రేగిడి: భూముల రీసర్వేతో రైతులకు ఎంతో ప్రయోజనముందని తహసీల్దార్ టి. కల్యాణ చక్రవర్తి అన్నారు. మండలంలోని సరసనాపల్లిలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రీ సర్వే వల్ల దీర్ఘకాలంగా ఉన్న సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. గ్రామంలో రీ సర్వే పూర్తయిందని, ఎటువంటి సమస్యలున్నా రెవెన్యూ అధికారులకు తెలియజేయాలన్నారు. ఆయనతో పాటు సర్పంచ్ కర్రి అప్పలనాయుడు, సర్వేయర్ పోలిపల్లి, రైతులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న వీఏహెచ్‌ఏలు

తెర్లాం: నాలుగు నెలల వయసు దాటిన పాడిపశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్ సూచించారు. మండలంలోని పెరుమాళి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయ పశుసంవర్ధక సహాయకులు పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పశువులకు ఎక్కువగా ఈ వ్యాధి బారినపడే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో వాటికి టీకాలు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ హేమలత పాల్గొన్నారు.

భూముల రీసర్వేకు సహకరించండి




పెరుమాళిలో భూముల వివరాలు తెలిపే మ్యాప్‌ను చూపిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: భూముల రీసర్వేకు సహకరించాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, బొబ్బిలి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కోల నారాయణరావు కోరారు. గ్రౌండ్ ట్రూథింగ్‌లో భాగంగా మండలంలోని పెరుమాళి గ్రామంలో భూ సరిహద్దుల గుర్తింపును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు గ్రామ సచివాలయంలో గ్రామసభ నిర్వహించి, రైతుల భూముల సరిహద్దులు గుర్తించే కార్యక్రమం జరుగుతోందని, రైతులంతా వారి భూముల వద్ద ఉండి సర్వే బృందానికి సరిహద్దులు చూపించాలని కోరారు. రైతుల సమక్షంలోనే భూముల సరిహద్దులు గుర్తిస్తే భవిష్యత్‌లో ఎటువంటి సమస్యలు రావన్నారు. గ్రామసభలో సర్పంచ్ సాగిరాజు హేమలత, మండల సర్వేయర్ వెంకటరమణ, వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

నేడు న్యాయ అవగాహన సదస్సు

రాజాం సిటీ: నగరంలోని ప్రభుత్వ బాలికల కళాశాలతో పాటు ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో పోక్సో చట్టం, యాసిడ్ దాడులు, కిడ్నాప్, బాల్యవివాహాలపై అవగాహన కల్పించనున్నామని పేర్కొన్నారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో మహిళల హక్కులు, న్యాయ సూత్రాలపై అవగాహన కల్పించనున్నామన్నారు.

వంటగ్యాస్ ధరల పెంపుపై ఆందోళన



కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

బొబ్బిలి: కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలు పెంచడంపై సీపీఐ ఆందోళనకు దిగింది. శుక్రవారం స్థానిక జెండామహల్ సెంటర్ దగ్గర జరిగిన నిరసన కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్‌లు ప్రధాని మోదీ ప్రభుత్వ వైఖరిని దుయ్యబట్టారు. పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ సామాన్య ప్రజానీకానికి కష్టాలు తీసుకువస్తున్నారని విమర్శించారు. మోదీ ప్రధానమంత్రి కాకముందు గ్యాస్ ధర రూ.450 ఉండేదని, ఇప్పుడు అది రూ.1200 చేరుకుందన్నారు. పేదలపై నిత్యావసరాల ధరల భారం మోపుతున్న బీజేపీని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని కోరారు. అలాగే పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో పేదల ఇళ్లను మున్సిపల్ అధికారులు కూల్చడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వై.బాబ్జీ, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



అప్పారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి రూరల్: అనారోగ్యానికి గురై, ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న మండలంలోని గున్నతోటవలస గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కలిశెట్టి అప్పారావును ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు శుక్రవారం కలిసి పరామర్శించారు. త్వరగా కోలుకుని, పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఎడ్ల అప్పారావు, గుణుపూరు శ్రీను ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

మెంటాడ: ఎంపీడీఓ కార్యాలయం ఏఓగా జి.వి.ఎస్ పార్థసారథి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి రూరల్: మండలంలోని సీతయ్యపేటలో కొత్తగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని దేవుడిని కోరుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ గోపుర పునఃప్రతిష్ట



యజ్ఞంలో పూర్ణాహుతి వేస్తున్న వేద పండితులు

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లిలో ఉన్న దాడితల్లి ఆలయ గోపుర పునః ప్రతిష్ట శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు పిండిప్రోలు మణికుమార్ శర్మ ఆధ్వర్యంలో హోమం, ప్రతిష్ట కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు.

సుధాకర్ గెలుపు అందరి బాధ్యత



కొండకవీధిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు

రాజాం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారు సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణంలోని కొండకవీధి, కొండంపేట, ఈశ్వరనారాయణ కాలనీ, బాబానగర్, తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులు పట్టభద్రులను నేరుగా కలిసి సీతంరాజును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, వంజరాపు విజయ్‌కుమార్, కలమట శంకర్, శాసపు వేణుగోపాలనాయుడు, గొర్లె నారాయణరావు, పొట్టా సత్యనారాయణగుప్త, ఆసపు సూర్యం, సింబాల రాము, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ'

- ఎంపీడీఓ శంకరరావు



రాజయ్యపేట అంగన్‌వాడీ కేంద్రంలో వివరాలు సేకరిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం: మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సక్రమంగా అమలు చేయాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆదేశించారు. పథకంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన సామగ్రిని లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. మండలంలోని కంచరాం, రాజయ్యపేట, తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అలాగే పోషణ ట్రాకర్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మిల్స్, తదితర యాప్‌ల పనితీరును వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దిలీప్‌కుమార్, ఆయా కేంద్రాల ఐసీడీఎస్ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. .

సైబర్ నేరాలపై అప్రమత్తం

వంగర: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైబర్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అలాగే బాల్య వివాహాలు, గుడ్/బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఓటర్ స్లిప్‌ల పంపిణీ

బొబ్బిలి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ స్లిప్‌లు శుక్రవారం పంపిణీ చేశారు. మొత్తం 4,536 ఓటర్లకు సంబంధించి, స్లిప్‌లు వచ్చాయని వాటిని ఓటర్లకు అందించామన్నారు.

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ ప్రారంభం

బాడంగి: స్థానిక అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు జరిగిన బోటనీ ప్రాక్టికల్స్‌కు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు హాజరై, చక్కగా పరీక్ష రాసి, ప్రయోగం చేశారు. నాలుగు రోజుల పాటు ఈ ప్రాక్టికల్స్ జరుగుతాయని ప్రిన్సిపాల్ టి.రామ్‌దాస్ తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ విస్తృత పర్యటన

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఆకులరెల్లి, సంఘు, బోయ, చాకలి వీధుల్లో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి, సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలన్నారు.

5, 6 తేదీల్లో తాగునీటి సరఫరా బంద్

బొబ్బిలి: పట్టణంలో ఈ నెల 5, 6వ తేదీల్లో తాగునీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున ఈ అంతరాయం కలుగుతోందని, పట్టణవాసులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



కేజీహెచ్‌లో రాముకు నగదు అందజేస్తున్న వలంటీర్ బాబూరావు

రేగిడి: మండలంలోని అక్కన్న అగ్రహారం గ్రామానికి చెందిన సూర రాము అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల పింఛన్ సొమ్మును వలంటీర్ పాదిలాపు బాబూరావు శుక్రవారం విశాఖ వెళ్లిమరీ అందజేశాడు.

బ్యాంక్ ఖాతాలకు ఆధార్ సీడింగ్ చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారులందరి బ్యాంక్ ఖాతాలకు వారి ఆధార్ నంబర్లను సీడింగ్ చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అధికారులు, క్షేత్ర, సాంకేతిక సహాయకులతో శుక్రవారం సమావేశమైన ఆయన వేతనదారులకు పనులు కల్పించడం, ఎస్ఎంఎంఎస్ హాజరు, సగటు వేతనం, వేతనదారులకు కల్పిస్తున్న పనిదినాలు, గృహ నిర్మాణ శాఖలో పనిదినాల కల్పన, సగటు వేతనం, బ్యాంక్ ఖాతాలకు ఆధార్ సీడింగ్ తదితర అంశాలపై పంచాయతీల వారీగా సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో ఉపాధి పనులను మరింత వేగవంతం చేయాలని, వేతనదారుల సంఖ్యను పెంచాలని తెలిపారు. సమావేశంలో ఏపీఓ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి

బాడంగి: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బాలమురళీకృష్ణ, ఎస్ఐ జయంతి శుక్రవారం సమావేశమై ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై చర్చించారు. ఈ నెల13వ తేదీన జరిగే ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఎస్ఐను తహసీల్దార్ కోరారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామని, అక్కడికి ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రం పరిశీలనలో తహసీల్దార్ ఆదిబాబు, సీఐ అప్పలనాయుడు

మెంటాడ: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ ఉత్తరావల్లి ఆదిబాబు, గజపతినగరం సీఐ లెంక అప్పలనాయుడు కలిసి శుక్రవారం పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట ఆంధ్ర ఎస్ఐ సిద్ధార్థ ఉన్నారు.

మధ్యాహ్న భోజనం నిర్వాహకులపై ఎంఈఓ ఆగ్రహం



చీకటిపేట పాఠశాలలో వంటలు పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: మండలంలోని చీకటిపేట పాఠశాలను ఎంఈఓ జె.త్రినాథరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూసి, అవి బాగోలేకపోవడంతో వంట నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంటి దగ్గరైతే ఇలాగే కూరలు వండుతారా అని ప్రశ్నించారు. మెనూ ప్రకారం వండిన పప్పు, ఆకుకూరలో ఆయా పదార్థాలు తగినంతగా లేకపోవడంతో ఇలా పలచగా కూర వండితే ఎలా అన్నారు. మరోసారి ఇదే విషయం బయటపడితే చర్యలు తప్పవన్నారు. అనంతరం మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం లేకపోవడంతో వెంటనే ఎస్ఎంఎఫ్ నిధులతో రన్నింగ్ వాటర్ సౌకర్యం కల్పించాలని హెచ్ఎంకు సూచించారు.